# క్లాసు దొంగ

- కాకాని కమల



**టీ**చరు క్లాసులోకి వచ్చేసరికి పదేళ్ళ రాము ఏడుస్తూ టీచరు దగ్గరకి వచ్చాడు.

"ఎందుకు రామూ ఏడుస్తున్నావ్" అంది టీచరు.

"ఫీజు కడదామని నేను తెచ్చిన రెండు వందలు పోయాయి టీచరు."

"అలాగా? ఎక్కడ పోయాయి"

"క్లాసులోనే ఎవరో తీసేశారు టీచర్." అన్నాడు మరింత బెక్కుతూ అర చేతుల్ని కళ్ళ దగ్గర నలుముకోసాగాడు.

"ఏం జరిగింది రాము. వివరంగా చెప్పు" బుజ్జగించింది టీచరు రాము కన్నీరు తుడుస్తూ.

"పొద్దున్న ఫీజు కడదామని వెడితే గుమాస్తా సార్ రాలేదు టీచరు. అందుకని నా బ్యాగ్‌లోనే పెట్టుకొని ప్రేయర్‌కి వచ్చాను. ఇంట్రవెల్‌లో కడదామని చూస్తే బ్యాగులో పెట్టుకున్న డబ్బు లేదు."

"అలాగా ప్రేయర్ కెళ్ళి నప్పుడు బ్యాగ్ ఎక్కడ పెట్టావు?"

"నా భుజానికే ఉంది టీచర్"

"ఊఁ అంటే క్లాసులోనే ఎవరో తీశారన్న మాట సరే. నువ్వెళ్ళి కూర్చో. మరేం భయం లేదులే" అంటూ పిల్లలకేసి తిరిగి అంది. "చూడండి పిల్లలు. మీరంతా ఐదవ తరగతి చదువుచున్న చిన్న పిల్లలు. ఈ వయసులో మీకు మంచి - చెడు తెలియదు. తెలియక తప్పులు చేయవచ్చు. కాని తప్పుని దిద్దుకునే అవకాశం నేను మీకు ఇస్తున్నాను. రాము బ్యాగులో డబ్బు మన క్లాసులోనే ఎవరో తీశారు. ఎందుకంటే ప్రార్థన సమయంలో రాము బ్యాగ్ భుజానే ఉంది. అక్కడ్నుండి క్లాసులోకి వచ్చాడు. రెండు పిరియాడ్స్ తర్వాత ఇంటర్‌వెల్. అప్పుడు చూస్తే రాము డబ్బు బ్యాగ్‌లో లేదు. అంటే ఆ డబ్బు తీసిన దొంగ మన క్లాసులోనే ఉన్నాడు." అంటూ లేచి పక్కన ఉన్న స్టోర్ రూమ్‌లోకి వెళ్ళింది ఆ గదిలో రైటర్ గారు కూర్చున టేబిల్ డ్రాయర్ ఉన్నాయి. డ్రాయరు మధ్యకి జరిపింది. ఆరోజు రైటర్‌గారు రాలేదు. అందుకే ఆ గది ఖాళీగా ఉంది. టీచర్ మళ్ళీ క్లాసులోకి వచ్చి ఆ స్టోరు గది తలుపులు మూసి "పిల్లలూ మీరందరూ మీ బ్యాగులు భుజానికి తగిలించుకోండి. అందరూ లైనుగా నిల్చోండి" అంది.

పిల్లలందరూ అలాగే చేశారు.

ఇప్పుడు మీరు ఒకరి తర్వాత ఒకరు ఆ గదిలోకి వెళ్ళి తలుపుకి లోపల గడియ వేసుకోండి. ఎవరు తీశారో వాళ్ళు ఆ డబ్బుని అక్కడ వున్న

డ్రాయర్ సొరుగులో పెట్టెయ్యండి. మీరు దొంగతనం చేసినా ఎవరికీ తెలియదు. నిజాయితీగా మీరు ఆ డబ్బు సొరుగులో పెట్టక పోతే నేనే మీలో దొంగ ఎవరో కనుక్కొంటాను. రేపు ఉదయం అసెంబ్లీలో ఆ పిల్లాడ్ని దొంగగా అందరికి చెప్తాను. అంతేకాదు ప్రిన్సిపాల్ గారి దగ్గరకి తీసుకెళ్ళి స్కూల్లోంచి తీయించేస్తాను. విన్నారుగా" అంది.

'విన్నాం' అన్నారు పిల్లలందరూ.

'సరే. అయితే ఒకరి తరువాత ఒకరు ఆ గదిలోకి వెళ్ళి తలుపులు లోపల గెడియ పెట్టి కాస్సేపుండి బయటికి రండి' అంటూ పిల్లలందర్నీ ఒకరి తర్వాత ఒకర్ని స్టోర్ గదిలో పంపించింది.

క్లాసులో పిల్లలందరూ వెళ్ళారు వచ్చారు. ఆ తరువాత టీచరు స్టోర్ గదిలోకి వెళ్ళి డ్రాయర్ సొరుగు తీసింది. కాని అందులో డబ్బు లేదు. టీచరుకి చాలా కోపం వచ్చింది.

"మీకు నేను ఒక మంచి అవకాశం ఇచ్చాను. కాని మీరు బుద్ధిగా నా మాట వినలేదు. అయినా మీలో ఆ డబ్బు తీసింది ఎవరో నేను కనుక్కోగలను" అంది. పిల్లలు మౌనంగా ఉండిపోయారు....

ఆ మధ్యాహ్నం లంచ్ బ్రేక్ తరువాత మళ్ళీ టీచరు క్లాసులోకి వచ్చింది. అప్పుడు తెలుగు టీచరు క్లాసు. పద్మావతి క్లాసులో ఉంది. "పద్మా. నువ్వు కాస్సేపు స్టాఫ్ రూములో కూర్చో నాకు పనుంది" అని ఆవిడ్ని పంపించి తన క్లాసు పిల్లల్తో ఇలా చెప్పింది. తన బ్యాగులోంచి కొన్ని సమాన కొలతలుగా అన్నీ ఒకేలా ఉన్న సన్నని రాళ్ళ కర్రల్ని తీసింది. వాటికి పసుపు కుంకం రాసి ఉన్నాయి. వరుసగా పిల్లలందర్నీ పిలిచి అందరికి ఆ కర్రల్ని ఇచ్చింది "పిల్లలూ... ఈ రాళ్ళ కర్రల్ని మీ బ్యాగులో పెట్టుకుని మీ ఇంటికి తీసుకెళ్ళి రేపు జాగ్రత్తగా తెచ్చి ఇవ్వండి. ఎవరైనా రేపు తేక పోయినా, పోయిందని చెప్పినా వాళ్ళే రాము డబ్బు తీశారని అర్థం. కాబట్టి ఇవి జాగ్రత్తగా తీసుకురండి. పోగొట్టద్దు. ఎందుకంటె ఇవి మామూలు రాళ్ళ కర్రలు కాదు. ఇవి మహిమగల దేవుని పూజలో పెట్టిన మహత్తుగల కర్రలు. వీటిలో 'జాదూ' ఉంది. ఈ కర్రలన్నీ సమాన కొలతగా ఉన్నాయి. కాని మీలో ఎవరైతే దొంగతనం చేశారో, వాళ్ళ కర్ర ఒక ఇంచి పెరుగుతుంది. అదే ఈ కర్రల మహత్తు. ఈ రాళ్ళ కర్రే దొంగని పట్టి ఇస్తుంది.' అని చెప్పింది.

పిల్లలందరూ భయంగా భక్తిగా ఆ రాళ్ళ కర్రల్ని బ్యాగుల్లో పెట్టుకుని ఇళ్ళకి తీసుకెళ్ళారు.

ఆ మర్నాడు ఉదయం టీచరు ఫస్ట్ పీరియడ్ క్లాసులోకి వస్తూనే అటెండెన్సు తీసుకుని 'అందరూ రాళ్ళ కర్రలు తెచ్చారా?' అంది.

'తెచ్చాం టీచర్' అన్నారు. సూది పడితే వినిపించేటంత నిశ్శబ్దంగా ఉంది క్లాసు. అందరిలో ఒక విధమైన భయం, భక్తి.

'సరే ఒకరి తరువాత ఒకరు వరుసగా వచ్చి మీ కర్రల్ని నాకియ్యండి' అంది.

అందరూ ఒకరి తరువాత ఒకరు కర్రలు తెచ్చి టీచరుకి ఇచ్చారు. క్లాసులో బండబ్బాయి మొండి రౌడీ అని పేరు తెచ్చుకున్న 'సోము' కూడా తన కర్రని తెచ్చి టీచరుకి ఇచ్చాడు.

ఆ కర్రని చూస్తూనే టీచర్ కళ్ళు ముడుచుకున్నాయి. సోము చెయ్యి పట్టుకుని తిరిగి అతని కర్రని ఆ కుర్రాడికే ఇచ్చి -

'సోము. కాస్సేపు ఇలా నా పక్కన నిల్చో' అని మిగతా పిల్లల కర్రలన్నీ తీసుకుంది. ఆఖరికి సోము కేసి చూస్తూ 'సోము. ఆ డబ్బు తీసిన దొంగవి నువ్వే. నిజం చెప్పు. ఆ డబ్బు ఏం చేశావు? ఎక్కడ పెట్టావు?' అంది గద్దిస్తున్నట్టు

సోము పొగరుగా తల విసురుతూ 'నేను తియ్యలేదు టీచర్' అన్నాడు.

'కాదు నువ్వే తీశావు. నిజం చెప్పు. లేకపోతే నిన్ను ప్రిన్సిపాల్గారి దగ్గరకి తీసుకెడతాను' అంది.

సోము తొణకకుండా మరింత గద్దరిగా ఎదిరిస్తున్నటు అన్నాడు.

'ఎందుకు టీచర్. నేను దొంగ తనం చేశానని ఎలా చెప్తున్నారు? మీరేమన్నారు? దొంగతనం చేసిన వాళ్ళ కర్ర ఒక ఇంచి పెరుగుతుంది అన్నారు కదా?'

'అవును అలాగే అన్నాను' అంది టీచర్.

'అయితే మరి నా కర్ర పెరిగిందా?' అన్నాడు పొగరుగా.

టీచర్ ప్రశాంతంగా సోము ముఖంలోకి చూస్తూ అంది. 'లేదు నీ కర్ర ఒక ఇంచి పెరగలేదు. ఒక ఇంచి తరిగింది. నువ్వు దొంగతనం చేశావు గనక అది ఎక్కడ ఒక ఇంచి పెరుగుతుందో అన్న భయంతో దాన్ని నువ్వు ఒక ఇంచి కత్తితో కోసేశావు. కాని ఈ కర్రల్లో ఏ మహత్తు లేదు. ఇవి మామూలు కర్రలు. అవి పెరగవు తరగవు. నీవు దొంగవి కానప్పుడు అది పెరుగుతుందన్న భయం నీకు వుండదు కదా? కాని నువ్వు భయపడ్డావు అంటే దొంగవని అర్థం. నిజం చెప్పు? డబ్బు ఎక్కడ దాచావు?' అంది గద్దిస్తున్నట్టు.

సోము బిక్క ముఖంతో బేరుమని ఏడవటం మొదలెట్టాడు. టీచరు గుచ్చి గుచ్చి అడగ్గా 'డబ్బు నేనే తీశాను టీచర్. నేను ఆ డబ్బుని కాగితంలో చుట్టి మన లైబ్రరీ గదిలో బీరువా వెనుక దాచాను టీచరు' అన్నాడు.

'సరే. వెళ్ళి తీసుకురా' అంది టీచరు. సోము లైబ్రరీ గదిలోకి వెళ్ళి డబ్బు పొట్లంతో తిరిగి వచ్చాడు. "సారీ టీచర్ ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యను. ప్రిన్సిపాల్ గారికి చెప్పకండి టీచర్' అన్నాడు వజవజ వణుకుతూ.

టీచరు బుజ్జగిస్తున్నట్లు సోముని దగ్గరకి తీసుకుంది. 'సోము భయపడకు. దొంగతనం చెయ్యటం తప్పుకాదు. నిజం చెప్పటం గొప్పతనం. నీవు నిజం చెప్పావు. కాని ఇకనుంచి అయినా బుద్ధిగా చదువుకో. క్లాసులో అందరి కంటె పెద్ద వాడివి నువ్వు. నీ వయస్సు 13 సంగరాలు. అయినా ఇంకా 5వ తరగతిలోనే ఉన్నావు. ప్రతి ఏటా అన్ని తరగతులు రెండేసి సంవత్సరాలు చదువుతున్నావు వయసుకే చెడ్డ బుద్ధులు నేర్చుకున్నావు. కాని ఇక నుంచి అయినా చక్కగా వుండు సోము" అంది.

'అలాగే టీచర్' అన్నాడు.

ప్యూన్ని పిలిచి "రాముని తీసుకెళ్ళి దగ్గరుండి ఫీజు కట్టించి తీసుకురా" అంటు డబ్బు ఇచ్చింది.

పిల్లలు మనస్తత్వంకి సరిపడే తను ప్రయోగించిన ట్రిక్ సైకాలజి ఫలించి నందుకు ఆమెకి ఆనందం కలిగింది. ❋

## పెయింటింగ్‌లో అద్భుత ప్రతిభావంతురాలు శాంతీ బాలచంద్రన్



15 ఏళ్ళ శాంతీ బాలచంద్రన్ అనే బాలిక పెయింటింగ్‌లో అద్భుత ప్రతిభ కనపరుస్తోంది. బెర్లిన్‌లో గల ఇండియన్ కల్చరల్ సెంటర్‌లో శాంతీ బాలచంద్రన్‌కు తన పెయింటింగ్‌ను ప్రదర్శించడానికి ఆహ్వానం లభించింది.

శాంతీ బాలచంద్రన్ చిన్న వయస్సులోనే పెయింటింగ్‌లో ఇంతటి పేరు పొందడానికి కారణం ఆమె పెయింటింగ్‌ను ఎక్కువగా ఇష్టపడడమే అని చెబుతోంది. ఈ బాలిక పెయింటింగ్‌లో మరెన్నో అద్భుతాలు సృష్టించాలని కోరుకుందాం.